సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం | 7 | మే | 2023



వైభవం.. వెంకన్న రథోత్సవం

మండలంలోని తడగొండలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం రథోత్సవంతో ముగిశాయి. 8లో▸



గురుశిష్యులు కరదీపిక!

చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. మంచి పుస్తకం కొనుక్కో అన్నారు పెద్దలు. ఎందుకంటే పుస్తకం జీవిత ముఖచిత్రాన్ని మారుస్తుంది. 8లో▸

గరిష్టం/కనిష్టం 33.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. కొన్ని చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

యువ సంఘర్షణ సభకు తరలిరండి

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 8న ప్రియాంకగాంధీ ఆధ్వర్యంలో నిర్వహించే యువ సంఘర్షణ సభకు నిరుద్యోగులు భారీ ఎత్తున తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ సూచించారు. మండలంలోని రామరావుపల్లెలో విలేకరులతో మాట్లాడారు. నిధులు, నియామకాలని సాధించుకున్న రాష్ట్రంలో నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. రాష్ట్రంలో 2లక్షలకు పైగా ఖాళీలు ఉన్నా భర్తీ చేయడం లేదన్నారు. యువతకు భరోసా కల్పించేందుకు కాంగ్రెస్ యువ సంఘర్షణ సభ నిర్వహిస్తోందన్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరుతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, మర్రిగడ్డ సర్పంచ్ నేతికుంట జలపతి, నాయకులు పులి సత్తయ్య, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, ఏగోలపు కిష్టస్వామి, నల్ల ఆనందరెడ్డి, నర్సింహరెడ్డి, పెద్దిగారి మోహన్, తిరుపతి ఉన్నారు.

జీపీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మూశం రమేశ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ కార్మికులకు రూ.వెయ్యి పెంచి చేతులు దులుపుకున్నారని తెలిపారు. ప్రాణాలు పణంగా పెడుతూ విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల డిమాండ్లు ఏళ్ల తరబడిగా అమలుకు నోచుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. సరైన పనికి సరైన వేతనాలు ఇవ్వకుంటే పోరాటాలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నల్‌దాస్ గణేష్, బుర్ర శ్రీనివాస్, లక్ష్మణ్, క్రిష్ణవేణి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాంటేషన్ పరిశీలన



పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని బాబాయిచురువుతండా, వన్‌పల్లి, మద్దిమల్ల గ్రామాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్లాంటేషన్‌ను ఫారెస్ట్ జోన్ చీఫ్ కన్జర్వేటర్ సైదులు శనివారం పరిశీలించారు. ఫారెస్ట్ అధికారి సీహెచ్.బాలమణి, రేంజ్ అధికారి శ్రీనివాసరావుతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. కార్యక్రమంలో వేములవాడ రేంజ్ అధికారి రంజిత్‌కుమార్, శ్రీనివాస్, పద్మలత, బీట్ అధికారులు, బేస్‌క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈవో

వేములవాడఅర్బన్: మన ఊరు– మనబడిలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను డీఈవో రమేశ్ కుమార్ శనివారం పరిశీలించారు. ప్రహరీ, కిచెన్‌షెడ్, డైనింగ్ హాల్, డ్రింకింగ్ వాటర్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. మండల విద్యావనరుల కేంద్రాన్ని సందర్శించారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోపు విద్యార్థులకు యూనిఫాం అందేలా చూడాలన్నారు.

అనిల్‌ను చివరిసారి చూసేందుకు భారీగా తరలివచ్చిన గ్రామస్తులు



సైనికా.. సెలవిక..

వీర జవాన్ అనిల్‌కు అశ్రునయనాల మధ్య అంతిమవీడ్కోలు



వీర జవాన్ అనిల్ భౌతికకాయం వద్ద పూలమాల వేస్తున్న మంత్రి గంగుల కమలాకర్



నివాళి అర్పిస్తున్న వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రవిశంకర్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్‌మహాజన్



భర్త భౌతికకాయం వద్ద సెల్యూట్ చేస్తున్న భార్య సౌజన్య



గుండెలవిసేలా రోదిస్తున్న అనిల్ తల్లి లక్ష్మి, తండ్రి మల్లయ్య, బంధువులు



గౌరవవందనం సమర్పిస్తున్న ఆర్మీ అధికారులు, జవాన్లు, పోలీసులు

దుఃఖంలోనూ భర్తకు భార్య సెల్యూట్

- తండ్రి చితికి నిప్పు పెట్టిన పెద్దకుమారుడు
- జనసందోహంతో కిక్కిరిసిన మల్కాపూర్
- నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు

బోయినపల్లి(చొప్పదండి): జమ్మూకాశ్మీర్‌లో జరిగిన ప్రమాదంలో చనిపోయిన అనిల్ అంతిమయాత్ర కుటుంబ సభ్యుల రోదనలు, బంధువులు, ప్రజాప్రతినిధుల అశ్రునయనాల మధ్య ముగిసింది. శనివారం ఉదయం అనిల్ భౌతికకాయం ఆయన స్వగ్రామమైన మల్కాపూర్‌లోని ఇంటికి చేరడంతో మండలవ్యాప్తంగా జనం భారీగా తరలివచ్చారు. ఆయన మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి గంగాధరకు చేరుకుంది. అక్కడ పలువురు యువకులు జాతీయ జెండాలతో స్వాగతం పలికి ర్యాలీగా మల్కాపూర్‌కు తీసుకెళ్లారు. అక్కడ ఆర్మీ అధికారులు సైనికలాంఛనాలతో గౌరవ వందనం చేశారు. అనంతరం అంతిమయాత్ర ప్రారంభించారు. అనిల్ వ్యవసాయ భూమిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్మీ సిబ్బంది గౌరవ వందనం చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. అనిల్ పెద్ద కుమారుడు అయాన్ తండ్రి చితికి నిప్పంటించాడు.

అమరుడైన భర్తకు భార్య సెల్యూట్

అనిల్ భౌతికకాయాన్ని చితిపై పెట్టిన అనంతరం సైనికులు గౌరవ వందనం చేశారు. సైనిక గీతం ఆలపించిన సమయంలో అంతులేని దుఃఖంలోనూ సౌజన్య భర్త భౌతికకాయానికి సెల్యూట్ చేయడం అక్కడున్నవారిని మరింత కంటతడి పెట్టించింది. తండ్రి చితికి ఆయన పెద్ద కుమారుడు అయాన్ నిప్పు పెట్టాడు. అనిల్ సైనిక యూనిఫాంను ఆర్మీ అధికారులు సౌజన్యకు అందించారు.

హాజరైన మంత్రి గంగుల, ఎంపీ సంజయ్

అనిల్‌కు మంత్రి గంగుల కమలాకర్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్, ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, కలెక్టర్ అనురాగ్‌జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీ తదితరులు నివాళులు



సౌజన్యకు అనిల్ యూనిఫాం అందిస్తున్న జవాన్లు

అర్పించారు. అంత్యక్రియలు ముగిసేవరకూ అక్కడే ఉన్నారు. ఎమ్మెల్యే రవిశంకర్ అనిల్ పాడె మోశారు. అంతిమయాత్రలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, వేములవాడ ఆర్డీఓ పవన్‌కుమార్, రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీలు కత్తెరపాక ఉమ, నాగం కుమార్, సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్, సర్పంచు కోరెప్పు నరేశ్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం, ఎంపీడీఓ నల్లా రాజేందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. ఏఎస్పీ చంద్రయ్య, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, బోయినపల్లి ఎస్సై మహేందర్ బందోబస్తు నిర్వహించారు.

అనిల్ కుటుంబాన్ని ఆదుకుంటాం

అనిల్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. అనిల్ అంత్యక్రియలు పూర్తయిన అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఆయన కుటుంబాన్ని పరామర్శించామని, యువ జవాన్‌ను కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు.



నిన్ను విడిచి ఎలా ఉండాలే బావా..

అనిల్ భార్య సౌజన్య రెండురోజులుగా కన్నీరుమున్నీరుగా విలపిస్తూనే ఉంది. 'బావా నిన్ను విడిచి నేనెలా ఉండాలే బావా.. పిల్లలను ఎట్ల సాదాలే బావా.. అని రోదించడం చూసేవారిని కంటతడి పెట్టించింది. 'నన్ను పోలీస్‌గా చూడాలని అంటివి. నీ మాటతోనే ఎస్సై పరీక్ష రాసిన బావ..' రెండు నెలలైతే దగ్గరికి బదిలీ చేయించుకుంట అంటివి.. అంతలోనే ఘోరం జరిగిందా బావా..' అంటూ భర్త ఫొటో ఉన్న ఫ్లెక్సీ వద్ద విలపించింది. అనిల్ తల్లి లక్ష్మి, అనారోగ్యంతో ఉన్న తండ్రి మల్లయ్య ఏడుస్తుండడాన్ని ఆపడం ఎవరితరమూ కాలేదు. కుమారులు అయాన్, అరయ్ సైతం తండ్రి శవపేటిక వద్ద విలపించారు.



అనిల్ అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన గ్రామస్తులు, బంధువుల



సౌజన్యను చూస్తూ కంటతడి పెడుతున్న ఎంపీ బండి సంజయ్, బొడిగె శోభ

ఆధ్యాత్మికత ఉట్టిపడాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వేములవాడలో అభివృద్ధి పనుల పరిశీలన

వేములవాడ: ప్రజల సౌకర్యం కోసం చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. వేములవాడ మూలవాగుబండ్, సుందరీకరణ, నందికమాన్ వద్ద చేపట్టిన పనులను శనివారం పరిశీలించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా పనులు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, పిల్లలతో కలిసి సాయంత్రం ఆహ్లాదంగా గడిపేలా పనులు ఉండాలన్నారు. రోడ్డుకిరువైపులా వాకింగ్ ట్రాక్, డ్రైనేజీ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. జూన్ 2 వరకు పనులన్నీ పూర్తి చేయాల్సిందేనని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, ఏఈ నర్సింహస్వామి, అధికారులు ఉన్నారు.



మూలవాగు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

నిరుద్యోగులతో ఆడుకోవద్దు

- కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలవి ప్రజావ్యతిరేక విధానాలు
- మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు వనిత

సిరిసిల్లటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత అన్నారు. శనివారం సిరిసిల్లలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలతో అటు దేశం, ఇటు రాష్ట్రం అధోగతి పాలైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇంటికో ఉద్యోగమన్న సీఎం కేసీఆర్ మాటలు ఉత్తవేనని తేలిపోయిందన్నారు. బంగారు తెలంగాణ ఎక్కడుందని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ఈనెల 8న హైదరాబాద్‌లో జరిగే నిరుద్యోగ సభకు ముఖ్య అతిథిగా ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ హాజరవుతున్నారని, మహిళాలోకం పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కొత్తగా నియమితులైన మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు పద్మను సన్మానించారు. మాజీ కౌన్సిలర్ వెల్ముల స్వరూప, సానియా, లక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



పద్మను సన్మానిస్తున్న వనిత

వీర జవాన్‌కు నివాళి



వీర జవాన్ అనిల్‌కు నివాళులర్పిస్తున్న వేములవాడ క్రీడాకారులు

వేములవాడ: హెలికాప్టర్ ప్రమాదంలో మరణించిన జవాన్ అనిల్‌కు పట్టణంలోని మార్నింగ్‌వాక్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) క్రీడాకారులు శనివారం నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం అనిల్ కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, మోటూరి ప్రవీణ్, మ్యాన సంతోష్, రమణారావు, బైరి సతీష్, గిరి, నగేశ్, రాజు, రాము, భరత్, రాకేశ్, మహేశ్, అజయ్, శ్రీనివాస్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ



బోయినపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ

బోయినపల్లి(చొప్పదండి): అనిల్ మృతికి సంతాపంగా శనివారం రాత్రి మండలకేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, ఉదారి నర్సింహాచారి, బొటుకు తిరుపతి, మినుకుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం





సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్, సమావేశానికి హాజరైన గ్రామస్తులు, మహిళలు

- ఒక్క కెమెరా వంద మందితో సమానం
- ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడరూరల్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకమని, ఒక్క కెమెరా వందమంది పోలీసులతో సమానమని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మర్రిపల్లి పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి అని, దొంగతనాలు, గొడవలు నివారించవచ్చని పేర్కొన్నారు. యువత, పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని, అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్తే కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే 100 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ గ్రామంలో 20 కెమెరాలను దాతలు, గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సర్పంచ్ కట్కం మల్లేశం, సీఐ బన్సీలాల్, ఎస్సై నాగరాజు, బాలకిషన్, జాగిరి రమ, ప్రవీణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల్లో నాణ్యత ఉండాలి

- గడువులోగా అందించాలి..
- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల: బతుకమ్మ చీరల్లో నాణ్యత, నవ్యత ఉండేలా ఉత్పత్తి చేయాలని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీపీటీడీసీ) చైర్మన్ గూడూరి ప్రవీణ్ అన్నారు. సిరిసిల్లలో మ్యాక్స్ సంఘాలు ఉత్పత్తి చేస్తున్న బతుకమ్మ చీరల తయారీని శనివారం పరిశీలించారు. జౌళిశాఖ నిర్దేశించిన గడువులోపు చీరలను అందించాలని సూచించారు. నాసిరకం నూలు వాడినా, చీరల తయారీలో నాణ్యత లేకున్నా.. ఆ చీరల బట్టను తిరస్కరిస్తామని తెలిపారు. కార్మికులకు ఉపాధి కల్పించే సదాశయంతో ప్రభుత్వం చీరల ఆర్డర్లను సిరిసిల్ల నేతన్నలకు అందించిందని వివరించారు. జౌళిశాఖ సిబ్బంది, మ్యాక్స్ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



వార్పిన్‌ను పరిశీలిస్తున్న ప్రవీణ్

క్లుప్తంగా

బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ దేశాయి బీడీ కంపెనీలో కార్మిక దినోత్సవ వేడుకలను బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముదిగొండ నారాయణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తోందన్నారు. యాజమాన్యాలకు వత్తాసు పలుకుతూ కార్మికుల సంక్షేమాన్ని మరిచిందన్నారు. బీడీ కార్మికుల వేతన సవరణను అమలు చేయాలని పేర్కొన్నారు. రాత్రనక, పగలనక కార్మికులు కష్టపడి బీడీలు చుడుతున్నారన్నారు. ప్యాకర్లు, సేకర్లను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు శోభన్, బాలు, టేకే దార్ల శ్రీనివాస్, రంగయ్య, రాజు, వెంకటేశ్, కార్మికులు ప్రభాకర్, శ్రీనివాస్, భారతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్‌లు పంపిణీ



బస్‌పాస్‌లు అందిస్తున్న అధికారులు

కోనరావుపేట(వేములవాడ): మండల కేంద్రంతో పాటు నిజామాబాద్ గ్రామంలో ప్రజల వద్దకు ఆర్టీసీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆర్టీసీ ద్వారా వికలాంగులకు, ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలు, వసతుల గురించి వివరించారు. ఈసందర్భంగా సిరిసిల్లలోని చందన హాస్పిటల్ డాక్టర్ చందనరెడ్డి పాల్గొని దివ్యాంగులకు ఉచితంగా బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో సర్పంచులు పోకల రేఖ, కేతిరెడ్డి అరుణ, ఎంపీటీసీ చారి, పోకల సంతోష్, ట్రాఫిక్ ఇన్‌చార్జి సారయ్య, డిపో సేఫ్టీ మేనేజర్ రాంరెడ్డి, ఆర్టీసీ సిబ్బంది రఘునాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు




గొల్లపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో శనివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ రాచర్ల శ్రీనివాస్‌శర్మ పర్యవేక్షణలో ఉదయం నుంచి వేద పారాయణం, కలశపూజ, తులసీ అర్చన, పుష్పాధివాసం, శ్రీలక్ష్మీజనార్ధన హోమం, సాయంత్రం అష్ట బలి, ప్రతిష్ఠ హోమం, శిఖర కలశప్రతిష్ఠ, మంత్రపుష్పం, అష్టక సేవలు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం తదితర ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేపట్టారు. ఆర్య వైశ్య సంఘం సభ్యులు చేపూరి రాజేశం, అల్లాడి కుమార్, రంగయ్య, వెంకన్న, బాల్‌రాజు, రాజేశం, మురళి, రవి, బండ సతీష్, మహిళలు పాల్గొన్నారు.

సండే స్పెషల్

గురుశిష్యుల కరదీపిక!

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: చినిగిన చొక్కా అయినా తొడుక్కో.. మంచి పుస్తకం కొనుక్కో అన్నారు పెద్దలు. ఎందుకంటే పుస్తకం జీవిత ముఖచిత్రాన్ని మారుస్తుంది. విజ్ఞానాన్ని పంచడమే కాదు, జీవితంలో వెలుగు నింపి, పదిమంది జీవితాల్లోనూ వెలుగులు నింపేలా చేయగల ఏకైక సాధనం. అందుకే, ఎన్నో కష్టాలు పడి, వ్యయప్రయాసలకు ఓర్చి తమ పిల్లల కోసం పాఠ్యపుస్తకాలు సంపాదిస్తారు తల్లిదండ్రులు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు కాస్త అటూ ఇటుగా అయినా.. ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు ఉచితంగా సరఫరా చేస్తుంది. కానీ, ప్రైవేటు స్కూళ్లలో చదువుకునే విద్యార్థులకు పుస్తకాలు దొరకడం కొన్నిసార్లు కష్టమవుతుంది. పేద విద్యార్థులైతే సెకండ్‌హ్యాండ్‌లో అయినా సరే.. ఎంతోకొంత చెల్లించి చదువుకుంటారు. ప్రతీ విద్యార్థి ఎంతో విలువైన పాఠ్యపుస్తకాలే తన విజ్ఞానసంపత్తిగా పూజిస్తారు. ఒక్క విద్యార్థులకే కాదు, వివిధ సబ్జెక్టులు బోధించే ఉపాధ్యాయులకు సైతం ఓ వెబ్‌సైట్ ఒక ఆన్‌లైన్ లైబ్రరీలా మారింది. అలాంటి విజ్ఞాన భాండాగారాలు ఆన్‌లైన్‌లో ఉచితంగా లభ్యమయ్యే వెబ్‌సైట్ గురించి సండే స్పెషల్...





సైబర్ సేఫ్టీ జాగ్రత్తలు | రోడ్డు భద్రత పాఠాలు | పదోతరగతి తెలుగు పీడీఎఫ్ | సుమతి శతకం ఆడియోఫైల్ ముఖచిత్రం



- ఎస్‌సీఈఆర్‌టీ తెలంగాణ వెబ్‌సైట్‌లో పాఠ్యపుస్తకాలు
- 1 నుంచి 10వ తరగతి వరకు ఇ- పుస్తకాలు
- ఏ సిలబస్ కావాలన్నా.. క్షణాల్లో డౌన్‌లోడ్
- ఎప్పటికప్పుడు విద్యా సమాచారం అప్‌డేట్
- అందుబాటులో శతక పద్యాల ఆడియో పుస్తకాలు
- ఉపాధ్యాయులు.. విద్యార్థులకు సమస్త సమాచారం

ఎస్‌సీఈఆర్‌టీ వెబ్‌సైట్‌లో

కాలంతోపాటు పుస్తకం ముఖచిత్రం, దాని తీరుతెన్నులూ మారాయి. ఒకప్పటిలా చేతిలో పట్టుకుని చదివేవేనే పుస్తకం కాదు, సెల్‌ఫోన్, ట్యాబ్, కంప్యూటర్ ఇలా ఎక్కడైనా, ఎప్పుడైనా చదువుకునేలా పాఠ్యపుస్తకాలు పీడీఎఫ్ ఫార్మాట్‌లోకి వచ్చేశాయి. అలా అని వీటికి ఎలాంటి రుసుము చెల్లించనక్కర్లేదు. ఎవరైనా ఉచితంగా చదువుకునేలా ఏర్పాటు చేశారు. https://scert.telangana.gov.in/(హెచ్‌టీటీపీఎస్://ఎస్‌సీఈఆర్‌టీ. టీఈఎల్‌ఏఎన్‌జీఏఎన్‌ఏ.జీవోవీ.ఐఎన్/ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం రూపొందించింది. వెబ్‌సైట్‌లో ఇ-టెక్స్ట్ బుక్ కాలంలో వెళ్లగానే 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూలతోపాటు గణితం, సైన్స్, సోషల్ పాఠ్యపుస్తకాలను పీడీఎఫ్ రూపంలో అందుబాటులో ఉంచింది. వీటిని ఎప్పుడైనా, ఎలాగైనా చదువుకోవచ్చు. కేవలం చదువుకోవడమే కాదు, కావాలిస్న పుస్తకం అందులో ఎంచుకున్న పాఠ్యాంశాన్ని పీడీఎఫ్ రూపంలోనూ డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

- సాధారణంగా ఈ వెబ్‌సైట్ విద్యార్థులకే కాదు, ఉపాధ్యాయులకు సైతం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో బోధించే టీచర్లంతా చాలా దూరం నుంచి స్కూళ్లకు వస్తుంటారు. అలాంటి వారంతా మార్గమధ్యలో తమ సెల్‌ఫోన్లలోనే ఈ వెబ్‌సైట్ ఓపెన్‌చేసి చెప్పాల్సిన సిలబస్‌ను ప్రిపేరవ్వడం, సాధన చేయడం, సమీక్షించుకోవడం వంటివి చేసుకునే వెసులుబాటు కలిగింది. ప్రయాణాల్లో ఉన్న విద్యార్థులు సైతం ఈ వెబ్‌సైట్ ఓపెన్ చేసుకుని పరీక్షలకు సిద్ధమవవచ్చు.
- అకడమిక్ క్యాలెండర్‌పైనా ఇక్కడ సమస్త సమాచారం ఉంది. సిలబస్‌తోపాటు పిల్లల పరీక్షల మూల్యాంకనం, పరీక్ష ప్రమాణాలు, రిజిష్టరు నిర్వహణ తదితర విషయంలో వృత్తిరీత్యా ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. వీటితోపాటు ట్రైనింగ్స్, టీచర్ ఎడ్యుకేషన్, టీసాట్ ప్రోగ్రాముల ప్రసారవేళలు, విద్యాశాఖ నిర్వహించే పలు రకాల కార్యక్రమాలు, అవార్డులు, సైన్స్ ప్రోగ్రాములు ఇలా అనేక రకాల ఉపయుక్తమైన సమాచారం టీచర్లకు అందజేస్తోంది.

శతక పద్యాల ఆడియో..!

ఇ-టెక్స్ట్ బుక్ కాలంపైన శతక పద్యాల ఆడియో కాలం ఉంటుంది. దీన్ని ఎంచుకుంటే తెలుగులో ప్రముఖ కవులు రాసిన సుమతీ, వేమన, భాస్కర, కుమార, దాశరథీ, నరసింహ, శ్రీకాళ హస్తీశ్వర శతకాలు అందుబాటులో ఉన్నాయి. ఈ శతక పద్యాలన్నీ పీడీఎఫ్ రూపంలో అందమైన పత్ర విన్యాసంతో ఆకర్షణీయంగా పీడీఎఫ్ పేజీల్లో తీర్చిదిద్దారు. ఈ పద్యాలు కేవలం చదువుకోవడానికే కాదు, ఈపద్యాలను వినే సదుపాయం కూడా ఉంది. పేజీల అగ్రభాగంలో ఆడియోఫైల్ చిహ్నం ఉంటుంది. దాన్ని ప్లే చేస్తే.. పద్యంగానం చేసి, దాని తాత్పర్యం ఉన్న ఆడియో ఫైల్ వినిపిస్తుంది. పిల్లలతోపాటు, సమస్త ప్రజలను సన్మార్గంలో నడిపే ఈ శతక పద్యాలను డిజిటల్ రూపంలో పొందుపరిచిన విధానంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తెలుగుపండితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగిత్యాల జిల్లాకు ప్రాధాన్యం

జగిత్యాల జిల్లాకు చెందిన బద్దెన కవి రచించిన సుమతీ శతకంలోని ఎంపిక చేసిన పద్యాలు ఈ ఆడియో ఫైల్స్‌లో చోటు దక్కించుకున్నాయి. అదే జిల్లా నుంచి కటుకోజ్వల మనోహరాచారి నేతృత్వంలో నేరెళ్ల శ్రీరామకృష్ణశాస్త్రి సంగీతం అందించారు. ఇందులో కటుకోజ్వల మనోహరాచారి, నేరెళ్ల శ్రీరామకృష్ణశాస్త్రితోపాటు మాధవి ఈ పద్యాలను గానం చేశారు.

కెరీర్ గైడెన్స్ కూడా

- 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఏ కోర్సు ఎంచుకోవాలో వివరిస్తూ కెరీర్ గైడెన్స్ సంబంధించిన సమాచారం అందుబాటులో ఉంచింది.
- సీబీఎస్ఈ ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ ఇంజనీరింగ్ కోర్సులు, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మెడికల్, కామర్స్, హిస్టరీ ఇలా అన్ని రంగాల్లో అగ్ర కోర్సులు వాటి ప్రాధాన్యాన్ని పరిచయం చేస్తుంది.
- రోడ్డు భద్రత: ఇందులో రోడ్డు భద్రతపై 1–10వ తరగతుల వరకు రోడ్డు భద్రత విద్య– ట్రాఫిక్ నిబంధనలు, జాగ్రత్తలపై పాఠాలు ఉన్నాయి.
- సైబర్ సేఫ్టీ: విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఏం చేయాలి? ఏం చేయకూడదో వివరించే జాగ్రత్తలను చిత్రరూపకంగా వివరించింది.
- వ్యక్తిగత భద్రత: పోలీసుశాఖ సహాయంతో ఆపదల్లో ఎలా వ్యవహరించాలి. ఇంట్లో, లిఫ్టుల్లో, నీటి వద్ద, అగ్నిప్రమాదాలు, వాహనాల వినియోగంపై పూర్తి అవగాహన కలగజేస్తుంది.
- ప్రపంచ తెలుగు మహాసభల వివరాలు, అందులో ప్రదర్శించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. బోధనలో టీచర్లకు ఉపయుక్తంగా ఉండేలా బీఈడీ పుస్తకాలు మొత్తం పీడీఎఫ్ ఫార్మాట్‌లో పెట్టారు.

సీఎం సూచనలతో..

సీఎం కేసీఆర్ సూచనల మేరకు విద్యాశాఖా మంత్రి సబితా సారథ్యంలో, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి చిత్రా రామచంద్రన్ సూచనలమేరకు తెలంగాణ రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ సంచాలకులు శేషుకుమారి ఆధ్వర్యంలో ఈ ఆడియోఫైల్స్ రూపొందించారు. వీటిని జిల్లాల నుంచి ఎంపిక చేసిన ప్రముఖ పండితుల చేత పాడించడం గమనార్హం.

డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె కొనసాగిస్తాం



తంగళ్లపల్లిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తమ సర్వీసును రెగ్యులరైజ్ చేసి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జూనియర్, అవుట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె శనివారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు ఇల్లంతకుంట, ముస్తాబాద్ మండలాల జేపీఎస్, ఓపీఎస్‌లు మోకాళ్లపై నిలుచుని నిరసన వ్యక్తం చేశారు. తమను వెంటనే రెగ్యులర్ చేయాలని, 4 ఏళ్ల ప్రొబేషనరీ కాలాన్ని సర్వీసులోకి తీసుకోవాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. ప్రభుత్వంపై యుద్ధం చేయాలని తమ ఆరాటం కాదని.. బతుకు దెరువు భరోసా కోసం చేస్తున్న పోరాటమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేపీఎస్, ఓపీఎస్‌లు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై మాయావతి వైఖరి స్పష్టం చేయాలి



లక్ష్మణ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని గత 29 ఏళ్లుగా మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో పోరాటం చేయడం జరుగుతుందని, ఈ విషయంలో బీఎస్పీ అధినేత్రి మాయావతి త న వైఖరి స్పష్టం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానాపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం ఎల్లారెడ్డిపేటలో మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల పర్యటనలో భాగంగా ఈనెల 7న హైదరా బాద్‌కు రానున్న మాయావతి వర్గీకరణ ఉద్యమంపై వారి మద్దతు విషయమై తెలుపాలన్నారు. సామాజిక న్యాయానికి కట్టుబడిన బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం ఆశయానికి అనుగుణంగా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఆ పార్టీ నిర్ణయం ఏంటో తెలుగు రాష్ట్రాల మాదిగ, మాదిగ ఉపకులాలకు స్పష్టం చేయాలన్నారు.

అక్రమ సాగును అడ్డుకున్న సెక్షన్ అధికారిపై దాడి

చందుర్తి(వేములవాడ): అటవీ ప్రాంతంలో అక్రమ సాగును అడ్డుకున్న అటవీ శాఖ సెక్షన్ అధికారిణిపై దాడి చేసిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలోని సనుగుల అటవీ ప్రాంతంలో శుక్రవారం రాత్రి అక్రమంగా సాగు చేస్తున్నారన్న సమాచారంతో సెక్షన్ అధికారి విజయ తమ రేంజ్ సిబ్బందితో వెళ్లి అడ్డుకుంది. దీంతో రెచ్చిపోయిన రామరావుపల్లె గ్రామానికి చెందిన నగర్ల తిరుపతి, సనుగుల గ్రామానికి చెందిన ముచ్చర్ల ఎల్లయ్య, ముచ్చర్ల లచ్చయ్య, దేవుని తండాకు చెందిన ఆజ్మీర బోజ్య దుర్భాషలాడుతూ సెక్షన్ అధికారితో పాటు సిబ్బందిపై దాడి చేశారు. సెక్షన్ అధికారి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని టౌన్ క్లబ్‌పై శనివారం రాత్రి పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. అందులో పేకాడుతున్న 19 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,34,490 నగదును పోలీసులు సీజ్ చేశారు. దీనిలో అధికారి పార్టీ నాయకులతోపాటు, వస్త్రవ్యాపార ప్రముఖులు, కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు. సిద్దిపేటకు చెందిన కొందరు వ్యక్తులు టౌన్ క్లబ్ వచ్చిన సందర్భంలో వచ్చిన బేదాభిప్రాయాలతో పేకాడుతున్న విషయం రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారుల వద్దకు విశ్వసనీయంగా చేరిందని, ఇదే సమాచారం పై జిల్లా పోలీసులకు ఆదేశాలందగా ఆకస్మికంగా తనిఖీలు చేశారని టౌన్ క్లబ్ సభ్యులు బహిరంగంగా చర్చించుకున్నారు. క్లబ్‌లో పేకాడుతున్న తాము డబ్బులు పెట్టి ఆడడం లేదని, వివిధ వ్యాపారాల్లో ఉన్న తాము పనులు ముగించుకుని క్లబ్ వచ్చే క్రమంలో ఉన్న డబ్బులు పోలీసులకు దొరికాయని పలువురు వెల్లడించారు. పట్టుబడిన 19 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు వారి సంతకాలు తీసుకుని వదిలిపెట్టినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు.

వైభవం.. వెంకన్న రథోత్సవం



నిజామాబాద్‌లో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



తడగొండలో స్వామివారి రథోత్సవం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని తడగొండలో ఐదు రోజులుగా జరుగుతున్న శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శనివారం రథోత్సవంతో ముగిశాయి. స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, రాష్ట్ర నాయకుడు జోగినిపల్లి రవీందర్‌రావు, ప్రేమ్ సాగర్‌రావు, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణం నుంచి గ్రామపంచాయితీ కార్యాలయ సమీపం వరకు రథోత్సవం సాగింది. స్వా మి వారి రథం లాగేందుకు యవకులు, మహిళలు, పిల్లలు పోటీ పడ్డారు. సర్పంచు చిందం రమేశ్, ఎంపీటీసీఉయ్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌లో..

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిజామాబాద్‌లో శ్రీవేంకటేశ్వరస్వామ రథోత్సవా న్ని శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం ప లు కుతూ మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ కేతి రెడ్డి అరుణ, ఉపసర్పంచ్ మల్లేశం, వైస్ ఎంపీపీ వంగాపె ల్లి సుమలత, ఆలయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని కొత్తపల్లిలో శ్రీవేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

అన్నదాతలకు అండగా టీడీఎఫ్ జై కిసాన్



టార్పాలిన్లు అందిస్తున్న రాజేశ్వర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): అన్నదాతలకు టీడీఎఫ్ జైకిసాన్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం జైకిసాన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మట్ట రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్, బందనకల్, చీకోడు గ్రామాల్లో టీడీఎఫ్ జైకిసాన్ ఆధ్వర్యంలో శనివారం రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు, ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లే దిశగా టీడీఎఫ్ రైతు సేవా కేంద్రం ఇప్పటి వరకు అనేక కార్యక్రమాలు చేసిందన్నారు. ప్రస్తుతం అకాల వర్షాలు, వడగండ్లతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి రక్షణ లేకుండా పోయిందని, దీంతో రైతులకు టార్పాలిన్లు, కవర్లు అందజేయడం జరిగిందన్నారు. ఐకేపీ, ప్యాక్స్ కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచుతున్నామని పేర్కొన్నారు. సింగిల్ విండో మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనిలో ఆగిన ఊపిరి

- గుండెపోటుతో కూలీ మృతి



నర్సయ్య (ఫైల్)

వేములవాడరూరల్: ఉపాధి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న యజమాని గుండె ఒక్కసారిగా ఆగి కుప్పకూలిపోయాడు. తోటి కార్మికులు వెంటనే స్పందించి ప్రాణాపాయం నుంచి తప్పించేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఈ విషాద ఘటన వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ గ్రామంలో శనివారం జరిగింది. గ్రామస్తులు, తోటి కార్మికుల వివరాలు.. ఫాజుల్‌నగర్‌కు చెందిన గంగిపల్లి నర్సయ్య (57) ఉపాధిహామీ పనులు చేస్తుంటాడు. ఎప్పటిలాగే శనివారం తోటి కార్మికులతో పనికి వెళ్లాడు. పని చేస్తుండగానే అకస్మాత్తుగా గుండెలో నొప్పి వచ్చింది. గమనించిన తోటి కార్మికులు నర్సయ్యను కాపాడేందుకు ఎంత ప్రయత్నించినా ప్రాణాలు దక్కలేదు. మాట్లాడుతూ అక్కడికక్కడే మృతిచెందాడు. ఎంపీడీవో రాంరెడ్డి, ఏపీవో మలయ్య ఘటనా స్థలానికి వెళ్లి కారణాలు తెలుసుకున్నారు. ఇంటి యజమాని మృతితో భార్య లీలవ్వ, కొడుకు, కోడలు కన్నీటి పర్యంతమయ్యారు. పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ వేణు, తోటి కార్మికులు కోరారు.

ఏడాదిలో ఇద్దరు..

వృద్ధ వయస్సులో కుటుంబ అవసరాల నిమిత్తం



అచేతన స్థితిలో నర్సయ్య

మండే ఎండలకు ఉపాధి పనులకు వెళ్తున్న కార్మికుల ఊపిరి ఆగుతోంది. పది నెలల క్రితం వట్టెంల గ్రామానికి చెందిన గొల్లపల్లి గంగనర్సవ్వ ఉపాధి పనులకు వెళ్లి ఇంటికి రాగానే గుండెనొప్పితో ఒక్కసారిగా కుప్పకూలి మృతిచెందింది. శనివారం ఫాజుల్‌నగర్‌కు గంగిపెల్లి నర్సయ్య పని చేస్తుండగానే గుండెనొప్పితో మృతిచెందాడు. ఏడాది కాలంలోనే ఇద్దరు కూలీలు గుండెనొప్పితో మృతి చెందడం తోటి కార్మికులను కలచివేస్తోంది. కాగా గతంలో చనిపోయిన నర్సవ్వకు ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందలేదు. ఉపాధి పనుల వద్ద అత్యవసర హెల్త్‌కిట్‌లు, వాటర్ సౌకర్యం ఉండాలని అధికారులు చెబుతున్నా.. ఏర్పాటు చేయడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES
OLD AGE HOME

- మీన్స్ వృద్ధుల సేవా సంస్థ నందు వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు, దీర్ఘవ్యాధులలో ఉన్నా వారికి, మానసిక, శారీరక వికలాంగులకు 24 గం॥ వైద్య, భోజనం, వసతి. ECIL, Hyd. సంప్ర: 9949520296/7981467036/6281127224. [H-781615]

BUSINESS OFFER

- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం, ఫోన్: 9310515624, 8800496710 [DA-36266]

WANTED

- Wanted Experienced Car Driver with Licence for House purpose. Karimnagar Local. Contact detail 6303961198, 9491151939 [K-1219820]
- ప్రముఖ కంపెనీ నందు మీ ఇంటి వద్దనే ఉండి పార్ట్ టైమ్/ఫుల్‌టైమ్ పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలయును. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 8341371684 [G-786224]
- విజయవాడలో A/c & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్-3, డోస్త్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ: 18-25,000 ట్రైనింగ్/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1165937]
- Need MF Who Are Good At ENG Speaking, as PRI & HS Spoken ENG Trainers. Experience, not a must. Free Training by CFEL. Sal 20 - 30K. Ph : 8919641609 [H-781477]
- పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-797521]
- పర్మినెంట్ జాబ్స్, ప్రముఖ సంస్థ నందు డేటా ఎంట్రీ ఆపరేటర్స్, సూపర్‌వైజర్, క్లర్క్స్, ఆఫీస్ బాయ్స్ కావలెను. Qul: 5 to డిగ్రీ, జీతం: 15000 to 35000 ఫోన్: 9059630792 [HA-6163]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824